సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 28 । మే । 2023



పుష్పగుచ్ఛం అందజేత

సిరిసిల్లటౌన్: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌ను సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య శనివారం కలిశారు.



యాదాద్రిలో జెడ్పీ చైర్‌పర్సన్

సిరిసిల్ల: యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామిని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. అర్చకులు వేదోక్త ఆశీర్వచనం అందించారు.

గరిష్ఠం/కనిష్ఠం
42.0/29.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం తక్కువగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయికి ఎంపిక



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. సీఎం కప్ 2023 క్రీడా పోటీలు మండల, జిల్లాస్థాయిలో ఇటీవల నిర్వహించగా, వాలీబాల్, షాట్‌పుట్ క్రీడల్లో 10 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఇందులో రాచర్లగొల్లపల్లికి చెందిన ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. వారిని శనివారం ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. వారికి స్థానిక దుర్గా ట్రేడర్స్ తరఫున టీషర్టులు అందజేశారు. విద్యార్థులను సర్పంచ్ పాశం సరోజన, కొండ రమేశ్ గౌడ్, దేవారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జబ్బర్, దేవయ్య, గణేష్, శ్రీధర్, అజయ్, ప్రవీణ్ అభినందించారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించండి



బోయినపల్లి(చొప్పదండి): ప్రభుత్వం వీవోఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. బోయినపల్లిలో వీవోఏల సమ్మె శిబిరాన్ని శనివారం సందర్శించి మద్దతు తెలిపారు. వీవోఏలకు నెలకు రూ.26వేల వేతనం చెల్లించాలని కోరారు. బోయినపల్లి, చొప్పదండి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, నాయకులు బోయిని ఎల్లేశ్, ఏనుగుల కనకయ్య, నిమ్మ వినోద్‌రెడ్డి, నాగుల వంశీ, బత్తిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటం



బోయినపల్లి(చొప్పదండి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిత్యం ప్రజల్లో ఉండి పోరాటాలు చేస్తున్నట్లు జిల్లా సీపీఐ కార్యదర్శి గుంటి వేణు తెలిపారు. మండలంలోని కొదురుపాకలో జూన్ 4న జరిగే సీపీఐ ప్రజాగర్జన విజయవంతం కోసం రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సింగరేణి తదితర ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం పోరాడుతున్నట్లు పేర్కొన్నారు. పంతం రవి, బుర్ర మల్లేశం, మీసం లక్ష్మణ్, సోమ నాగరాజు, మండల కన్వీనర్ జూపల్లి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

పోలీస్ సహకారంతో ధాన్యం తరలింపు



ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని తెర్లుమద్ది ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ధాన్యం తరలింపు చేపట్టారు. నాలుగు రోజులుగా ధాన్యం తరలింపు నిలిచిపోయిందని, వాహనాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్సైకి ఫిర్యాదు చేసిన వెంటనే వాహనాలను ఏర్పాటు చేయించారని ఎంపీటీసీ దుర్గవ్వ తెలిపారు. తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు వాహనాలు లేకపోవడంతో నిర్వాహకులు కాంటా పెట్టడం నిలిపివేశారన్నారు. ఎస్సై స్పందించి వాహనాలు ఏర్పాటు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సైపై నేషనల్ హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు

ఇల్లంతకుంట(మానకొండూర్):ఇల్లంతకుంట ఎస్సై కె.రాజేశ్‌పై రేపాక గ్రామ ఎంపీటీసీ కథ సుమలత గత నెల 8న నేషనల్ హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 23న ఎస్పీకి ఆర్డర్ పంపినట్లు ఎంపీటీసీ సుమలత తెలిపారు. సుమలత మాట్లాడుతూ న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే ఎస్సై తనను అకారణంగా దూషించారని తెలిపారు. నేషనల్ హెచ్‌ఆర్సీ స్పందించి ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఆదేశించారని పేర్కొన్నారు.



సివిల్స్ ఎవరైనా సాధించవచ్చు

- లక్ష్యసాధనతో ముందుకు సాగాలి
- సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి
- ప్రిపరేషన్ టైమ్‌లో సినిమాలు చూశా
- సీనియర్ల సలహాలు తీసుకున్నా..
- కుటుంబంలో టీచర్లు ఉండడం కలిసొచ్చింది

'సాక్షి'తో సివిల్స్ 94వ ర్యాంకర్ ఆవుల సాయికృష్ణ

సాక్షిప్రతినిధి, కరీంనగర్: 'ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో పేద, ధనిక తేడాలేదు. ప్రతిభ ఉన్న ఎవరైనా కల నెరవేర్చుకోవచ్చు. ఏ పోటీపరీక్షకైనా ఆన్‌లైన్‌లో బోలెడు కంటెంట్, మెటీరియల్ ఉంది. ప్రణాళిక, పట్టుదల ఉంటే కోచింగ్ అక్కర్లేదు. దినపత్రికలు చదవాలి. నోట్స్ తయారు చేసుకోవాలి. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి.' అని సివిల్స్ విజేత సాయికృష్ణ అన్నారు. కరీంనగర్‌కు తొలిసారిగా వచ్చిన ఆయన శనివారం 'సాక్షి'తో ముచ్చటించారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

సండే స్పెషల్

పట్టుదల ఉంటే.. కోచింగ్ అక్కర్లే



తన కలనే మా కల

సాయి చిన్నప్పటి నుంచే ఐఏఎస్ కావాలని లక్ష్యంగా పెరిగాడు. అందుకోసం నిరంతరం శ్రమించాడు. తన కలను మా కలగానే అనుకుని అన్ని విధాలా సహకరించాం. ఈ సుదీర్ఘ ప్రయాణంలో అతను అడిగినవన్నీ సమకూర్చాం. 2017లోనే ఐసీఎల్‌ఎస్ వచ్చినా సంతృప్తి చెందలేదు. తన స్వప్నం సాకారం కోసం రాత్రింబవళ్లు శ్రమించాడు. చివరికి సాధించాడు.

\- ఆవుల లక్ష్మయ్య

ప్రైవేటు ఉద్యోగాన్ని వదులుకున్నాడు

2015లోనే నా కుమారుడు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సెలెక్టయ్యాడు. తల్లిదండ్రులుగా మేమెంతో ఆనందపడ్డాం. ఆకర్షణీయమైన ప్యాకేజీ చేతికి అందినా పక్కనబెట్టాడు. తన కలల వైపు అడుగులేశాడు. చివరికి నా కొడుకు తన కలను నెరవేర్చుకున్నాడు. ఈ రోజు ఇంకా సంతోషిస్తున్నాం.

\- ఆవుల సునీత

సోషల్ మీడియాకు దూరం

సోషల్‌మీడియాకు దూరంగా ఉన్నాను. కంటెంట్ కోసమే ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశాను. లక్ష్య సాధనకు అవసరమైన సమాచారం కోసమే యూట్యూబ్, గూగుల్‌లో సెర్చ్ చేశాను. అది నాకు ఎంతగానో ఉపయోగపడింది. అప్పుడప్పుడు సినిమాలు కూడా చూశాను. కానీ పరిమితంగానే చూశాను. ఈ కాలం తల్లిదండ్రులు తమ పిల్లలకు పాఠశాల దశలోనే ఐఏఎస్, ఐఐటీ కోర్సులు అంటూ నేర్పిస్తున్నారు. ఇది కొంత ఇబ్బందికరమే. పాఠశాల, ఇంటర్ స్థాయిలో ఐఐటీ, ఐఏఎస్ కోచింగ్‌లు ఇప్పించడం సరికాదు. ప్రతీ విద్యార్థి తనకంటూ ప్రత్యేకమైన టాలెంట్ ఉంటుంది. అది తెలుసుకొని అటువైపు వెళ్తే సక్సెస్ అవుతారు. అయితే కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ తెలుసుకోవడం ప్రతీ విద్యార్థికి అవసరమే. ఏ పోటీ పరీక్షలోనైన కరెంట్ అఫైర్స్‌పై పట్టు ఉంటేనే రాణించగలుగుతారు.

లక్ష్యసాధనకు ఏడేళ్ల తపస్సు

సివిల్స్ నా చిన్ననాటి కల. దాని కోసం ఏడేళ్ల తపస్సు చేశా. నేను పడ్డ కష్టానికి ఫలితం దక్కింది. సివిల్స్‌లో 94వ ర్యాంక్ రావడం ఆనందంగా ఉంది. నాలుగో తరగతిలో ఉన్నప్పుడు జిల్లాకు కలెక్టర్‌గా సుమితా డావ్రా వచ్చారు. ఆమె గురించి అందరూ గొప్పగా చెబుతుంటే విని స్ఫూర్తి పొందాను. కరీంనగర్‌పై ఆమె రాసిన 'పూర్ బట్ స్పిరిటెడ్ కరీంనగర్' పుస్తకం నాకు ప్రేరణనిచ్చింది.

ఆన్‌లైన్‌లో మెటీరియల్ ఎక్కువే..

ఇంటర్నెట్లో అన్ని పరీక్షల మెటీరియల్ దొరుకుతుంది.ఆ మెటీరియల్ సివిల్స్ ప్రిపేర్ అయ్యే వారికి చాలా ఉపయోగకరంగా ఉంది. ఇంగ్లిష్ వస్తేనే సివిల్స్ సాధిస్తామనే అపోహను వీడాలి. మన మాతృభాషలో కూడా పరీక్ష రాసే అవకాశం ఉంది. ఇంటర్వ్యూ సైతం మాతృభాషలోనే నిర్వహిస్తారు. కోచింగ్ తీసుకోవాలనే అపోహ, ఇంగ్లిష్ రాదనే భయం వీడితే ఎవరైన సివిల్స్ సాధించవచ్చు.

కుటుంబమే పెద్ద అండ

సివిల్స్ ప్రిపరేషన్‌లో కుటుంబం అండగా నిలిచింది. నాన్న, మామయ్యలు, అత్తయ్యలు ఎనిమిది మంది వరకు ప్రభుత్వ టీచర్లే.వారి ద్వారా స్ఫూర్తి పొందేవాడిని. 2015లో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం వస్తే చేరకున్నా ఎవరూ ఏమీ అనలేదు.ఇంటికే పేపర్ వస్తుండడంతో చిన్నప్పటి నుంచే దినపత్రికలు చదవడం అలవాటుగా మారింది. ఈ అలవాటు సివిల్స్‌కు ఎంతో ఉపయోగపడింది.

సొంతంగా నోట్స్ తయారు చేసుకున్నా..

వరంగల్ ఎన్ఐటీలో 2015లో బీటెక్ పూర్తయ్యింది. ఢిల్లీకి వెళ్లి సివిల్స్ కోచింగ్ తీసుకున్న. సొంతంగా నోట్స్ తయారు చేసుకున్న. 2017 సివిల్స్‌లో 728వ ర్యాంకుతో ఐసీఎల్‌ఎస్ వచ్చింది. నా లక్ష్యం ఐఏఎస్ కావడంతో మళ్లీ ప్రిపేర్ అయ్యాను. రోజుకు 5 నుంచి 7 గంటలు చదివాను. ఈ క్రమంలో మా సీనియర్ తక్కల్లపల్లి యశ్వంత్‌రావు ఇచ్చిన సలహాలు చాలా ఉపయోగపడ్డాయి.

ఆధునిక హంగులతో ఆలయ నిర్మాణం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని శ్రీరుక్మిణి-సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా బాలాలయాన్ని ఆధునిక హంగులతో పూర్తి చేస్తామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ రూ.1.80 కోట్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా చేపట్టాల్సిన పనులపై చర్చించేందుకు ఆలయ కమిటీ, గ్రామస్తులు శనివారం సమావేశమయ్యారు. ఈనెల 31న బాలాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని కరీంనగర్‌కు చెందిన వరప్రసాదాచార్యులు, రాచర్ల రఘురామశర్మ నిర్ణయించారు. ఈ సందర్భంగా తోట ఆగయ్య మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆగమ శాస్త్రం ప్రకారం పురాతన ఆలయంలోని విగ్రహాలను బాలాలయంలో ప్రతిష్ఠించి నూతన ఆలయ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. నూతన ఆలయం పూర్తయ్యే వరకు నిత్యపూజలు, వివిధ కార్యక్రమాలు కొనసాగించాలని ఆలయ అర్చకులకు సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్, సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, అర్చకులు నవీన్‌చారి, గోపాల్‌చారి, హన్మండ్లశర్మ, ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మేగి నర్సయ్య, బొమ్మకంటి భాస్కర్, బండారి బాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తోట ఆగయ్య



పార్కింగ్‌పై పట్టింపేది ?

సిరిసిల్ల: సిరిసిల్ల పాత బస్టాండులో పార్కింగ్ సమస్యలు ఎదురవుతున్నాయి. కార్లు, బైక్‌లు పార్కింగ్ చేసేందుకు స్థలం లేక రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. శనివారం ఓ కారును డ్రైవర్ ఏకంగా ఆర్టీసీ బస్సు ముందే నిలిపివేశాడు. బస్సులు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. సిరిసిల్ల మున్సిపల్ అధికారులు నిర్మించిన పాత బస్టాండులో పార్కింగ్ లేకపోవడంతో ఇబ్బందిగా మారింది.

ప్రగతి ప్రస్థానాన్ని చాటేలా వేడుకలు

- జూన్ 2 నుంచి 22 వరకు దశాబ్ది ఉత్సవాలు
- కలెక్టర్ అనురాగ్ జయంతి





మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, హాజరైన జిల్లా అధికారులు

సిరిసిల్ల: తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని చాటి చెప్పేలా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా అధికారులతో సమీక్షించారు. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు 20 రోజులపాటు దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ షెడ్యూల్ ప్రకారం ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఆదేశించారు. రోజువారీ కార్యక్రమాలపై సంబంధిత ప్రభుత్వ శాఖలు పోస్టర్లు, కరపత్రాలు, ఫ్లెక్సీలను పబ్లిక్ ప్రదేశాల్లో ప్రదర్శించాలని సూచించారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు, ఆర్డీవో పవన్‌కుమార్, సీపీవో పీబీ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, డీపీఆర్వో దశరథం, కలెక్టరేట్ పాలనాధికారి బొద్దుల గంగయ్య, సెక్షన్ అధికారి వేణు పాల్గొన్నారు.

ధర్మారం ఎన్‌కౌంటర్‌కు 35 ఏళ్లు

- 1988 మే 28న సహదేవ్‌రెడ్డి మృతి
- నేడు హైదరాబాద్‌లో 'రక్త చలన సంగీతం' పుస్తకావిష్కరణ
- హైదరాబాద్‌లోని ఎస్‌వీకేలో కార్యక్రమం

సిరిసిల్ల: కల్లోల సిరిసిల్ల ప్రాంతంలో రెండు దశాబ్దాల కిందట మూడు తుపాకుల మధ్య జనజీవనం అల్లకల్లోమయ్యేది. ఒకటి అప్పటి పీపుల్స్‌వార్(మావోయిస్టు) తుపాకీ, మరొకటి సీపీఐ(ఎంఎల్) జనశక్తి తుపాకీ, మూడోది పోలీసుల తుపాకీ. ఈ మూడు ప్రజాజీవనంపై తీవ్ర ప్రభావం చూపేవి. అప్పటి సిరిసిల్ల, వేములవాడ పాత తాలూకాలు.. ఇప్పటి రాజన్నసిరిసిల్ల జిల్లాను మొత్తంగా కల్లోలిత ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటించడంతో నిత్య నిర్బంధం కొనసాగింది. ఆ పరంపరలోనే కోనరావుపేట మండలం ధర్మారం వద్ద 1988 మే 28న తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ఎన్‌కౌంటర్‌లో జనశక్తి పార్టీకి చెందిన పీడీఎస్‌యూ నాయకుడు రిక్కల సహదేవ్‌రెడ్డి మరణించాడు. ఆ ఎన్‌కౌంటర్‌కు 35 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన జ్ఞాపకాల్లో వచ్చిన 'రక్తచలన సంగీతం' పుస్తకాన్ని హైదరాబాద్‌లోని ఎస్‌వీకేలో ఆదివారం ఆవిష్కరిస్తున్నారు. 1988 సెప్టెంబరులోనే విరసం సిటీ యూనిట్ ఈ పుస్తకాన్ని తెచ్చింది. అదే పుస్తకాన్ని మళ్లీ ముద్రించి ఆవిష్కరిస్తున్న సందర్భంగా రిక్కల సహదేవ్‌రెడ్డి ఎన్‌కౌంటర్ జరిగిన నాటి పరిస్థితులపై ప్రత్యేక కథనం..



ఎన్‌కౌంటర్ జరిగిన ధర్మారం పరుపు బండ



రిక్కల సహదేవ్‌రెడ్డి(ఫైల్)

ధర్మారంలో ఎన్‌కౌంటర్

సీపీఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి(సీపీ) గ్రూప్ బలపడుతున్న రోజులు. జనశక్తి పార్టీకి పురిటిగడ్డ నిమ్మపల్లిలో భూపోరాటం ఎగిసిపడుతోంది. విప్లవ సాయుధ పోరాటాలను పోలీసులు కట్టడి చేయాలని భావిస్తున్నారు. పోలీసు ఇన్‌ఫార్మర్ల పేరిట భూస్వాములను జనశక్తి నక్సలైట్లు హత్యలు చేస్తున్నారు. పోలీసులు అప్పటికే నక్సలైట్లను కట్టడి చేసేందుకు కొండాపూర్‌లో కిరణ్ దళాన్ని మొత్తంగా ఐదుగురిని ఎన్‌కౌంటర్ చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో సిరిసిల్లలో పీడీఎస్‌యూ నాయకుడిగా విద్యార్థి సమస్యలపై ఉద్యమిస్తూ.. 'వెల్లువ' అనే సాహిత్య పత్రికను రిక్కల సహదేవ్‌రెడ్డి నడుపుతున్నారు. అజ్ఞాత నక్సలైట్లతో సంబంధాలు కలిగి ఉన్న సహదేవ్‌రెడ్డిని పోలీసులు సిరిసిల్లలో పట్టుకున్నారు. జనశక్తి నక్సలైట్ల ఆచూకీ చెప్పాలని రెండు రోజులపాటు చిత్రహింసలకు గురిచేశారు. పోలీసుల దెబ్బలను భరించిన సహదేవ్‌రెడ్డి విప్లవ రహస్యాలను పెదవి దాటనీయలేదు. మే 28 తెల్లవారుజామున కోనరావుపేట మండలం ధర్మారం తునికాకు కల్లం వద్ద ఎన్‌కౌంటర్ చేశారు. తునికాకు కల్లాన్ని జనశక్తి నక్సలైట్లు కాలబెట్టేందుకు వస్తున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకోగా.. నక్సలైట్లు కాల్పులు ప్రారంభించారని.. ఆత్మరక్షణకు పోలీసులు జరిపిన కాల్పుల్లో సహదేవ్‌రెడ్డి మరణించాడని పోలీసుల కథనం. రక్తం మడుగులో పడి ఉన్న శవం చేతిలో తపంచా(ఆయుధం), పక్కనే కొన్ని సాహిత్య పుస్తకాలు. ఇది ఆనాటి ఎన్‌కౌంటర్ దృశ్యం. ఈ ఘటనతో పల్లెలు ఉలిక్కిపడ్డాయి. బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ.. పౌరహక్కుల సంఘాలు.. ప్రజాసంఘాల ఖండించాయి.

ఎవరీ సహదేవ్‌రెడ్డి

ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌కు చెందిన రైతు కుటుంబంలో పుట్టిన సహదేవ్‌రెడ్డి 1980లో విప్లవోద్యమంలోకి అడుగు పెట్టాడు. మరో అమరుడు పిట్టల వెంకన్నతో కలిసి పీడీఎస్‌యూలో విద్యార్థి కార్యకర్తగా చేరాడు. చంద్ర పుల్లారెడ్డి (సీపీ) గ్రూప్‌లో చురుకైన కార్యకర్తగా పనిచేశాడు. సిరిసిల్లలో ఉంటూ విప్లవోద్యమంలో కీలక నాయకుడిగా ఉన్నాడు. 1988 జనవరిలో ఒంగోలులో జరిగిన విరసం మహాసభల్లో పాల్గొన్నాడు. కరీంనగర్ జిల్లాలో నూతన సాహితీ సంస్థను ఏర్పరచి ఒక సాహిత్య పత్రికను నడపడంలోనూ భాగస్వామి అయ్యాడు. సహదేవ్‌రెడ్డి ధర్మారం వద్ద ఎన్‌కౌంటర్ అయిన ఏడాదిన్నరకే 1989లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో సిరిసిల్ల ఎమ్మెల్యేగా జనశక్తి బలపరిచిన అభ్యర్థి ఎన్వీ కృష్ణయ్య గెలుపొందడం విశేషం.

నేడు' రక్తచలన సంగీతం' పుస్తకావిష్కరణ

ధర్మారం ఎన్‌కౌంటర్ మృతుడు సహదేవ్‌రెడ్డి జ్ఞాపకాల్లో 1988లో వచ్చిన 'రక్తచలన సంగీతం' పుస్తకాన్ని హైదరాబాద్‌లోని ఎస్‌వీకేలో ఆదివారం ఆవిష్కరిస్తున్నారు. ఈ పుస్తకాన్ని విరసం సిటీ యూనిట్ ముద్రించింది. అదే పుస్తకాన్ని మళ్లీ ముద్రించి ఆవిష్కరిస్తూ సహదేవ్‌రెడ్డిని స్మరించుకోనున్నారు.

క్లుప్తంగా

కేటీఆర్ పీఎస్ శ్రీనివాస్‌కు పరామర్శ


శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న గడ్డం నర్సయ్య

సిరిసిల్లటౌన్: రాష్ట్ర మంత్రి కేటీఆర్ పీఎస్ శ్రీనివాస్‌ను శనివారం సిరిసిల్ల నేతలు పరామర్శించారు. ఇటీవల శ్రీనివాస్ మాతృమూర్తి చనిపోయిన విషయం తెలిసిందే. నల్గొండలో ఉంటున్న శ్రీనివాస్‌ను జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సిరిసిల్ల వేంకటేశ్వర ఆలయ మాజీ చైర్మన్ బైరి ప్రభాకర్, తోట రాజేందర్, పాషాఖాన్ ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై శేఖర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మిస్సయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ యాప్ ద్వారా గుర్తించారు. బాధితునికి ఎస్సై శేఖర్ శనివారం అందించారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన మస్కూరి రాజు తన సెల్‌ఫోన్ పోయిందని గతనెల 22న పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఐఎంఈఐ నంబర్ ద్వారా సీఈఐఆర్ యాప్‌లో నమోదుచేయగా.. సెల్‌ఫోన్ జాడ తెలిసింది. దీంతో సెల్‌ఫోన్‌ను రికవరీచేసి బాధితునికి ఎస్సై అందించారు. ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుచేయాలన్నారు. ఈ యాప్‌ను ప్రతిఒక్కరూ సెల్‌ఫోన్‌లో వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

రాజ్యాంగ గ్రంథాలను ఇంటింటా పంపిణీ చేయాలి

ముస్తాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం గ్రంథాలను ప్రతీ పౌరుడికి అందించాలని డిమాండ్ చేస్తూ ముస్తాబాద్‌లో ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రచార కమిటీ సభ్యురాలు పరమేశ్వరి మాట్లాడుతూ.. గతంలో ఇంటింటికి రాజ్యాంగ గ్రంథాలను అందించాలని ధర్మ సమాజ్ పార్టీ తరపున కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరామన్నారు. ఇప్పటికి ప్రభుత్వాల నుంచి ఎలాంటి స్పందన రాలేదని, దీనికి నిరసనగా రాజీవ్‌చౌక్‌లో ధర్నా చేపట్టామన్నారు. రాజ్యాంగం గ్రంథం అందిస్తే ప్రతీ పౌరుడు తమ హక్కులు, విధులు తెలుసుకోగలుగుతాడన్నారు. రాజీవ్ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రం అందించారు. ఇప్పటికైనా రాజ్యాంగ గ్రంథాలను ఇంటింటికీ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లావణ్య, బాబు, అరుణ్, విక్రమ్, సురేశ్, మధు, మహేశ్, గుండురావు తదితరులు పాల్గొన్నారు.

‘పాలిటెక్నిక్’ కు ఎన్‌బీఏ గుర్తింపు



అగ్రహారం శ్రీ రాజరాజేశ్వర పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాల

- మూడు కోర్సులు.. మూడేళ్ల కాలపరిమితి

వేములవాడఅర్బన్: జిల్లాలోని ఏకైన పాలిటెక్నిక్ కాలేజీకి నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. ఎన్‌బీఏ గుర్తింపుతో కాలేజీలో కొత్త కోర్సులను ప్రారంభించుకునేందుకు అవకాశం దక్కుతుంది. ప్రభుత్వ సంస్థలు పరిశోధన, ప్రాజెక్ట్‌ల మంజూరుకు అవకాశాలు మెరుగుపడతాయి. ఈ గుర్తింపుతో కళాశాలలో చదివిన విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధి అవకాశలు మెరుగు పడతాయి.

1979లో ప్రారంభం

వేములవాడ మండలం అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను 1979లో ప్రారంభించారు. 20 ఎకరాలలో కాలేజీ విస్తరించి ఉంది. ప్రస్తుతం ఐదు కోర్సులు నిర్వహిస్తున్నారు. సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, టెక్స్‌టైల్ టెక్నాలజీ, కంప్యూటర్ అండ్ కమర్షియల్ ప్రాక్టీస్ కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ఈ ఐదు కోర్సులలో 1000 మంది విద్యార్థులు చదువుతున్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది 80 మంది ఉన్నారు.

చాలా సంతోషంగా ఉంది



పాలిటెక్నిక్ కళాశాలలోని మూడు కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు దక్కడం చాలా సంతోషంగా ఉంది. ఈ గుర్తింపు కోసం కృషిచేసిన అధ్యాపకులకు కృతజ్ఞతలు. విద్యార్థులు కళాశాలలో చేరి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.
– డాక్టర్ రాజగోపాల్, ప్రిన్సిపాల్, అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల

మూడేళ్లు.. మూడు కోర్సులు

ఎన్‌బీఏ గుర్తింపు కాలేజీలోని సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగాలకు దక్కింది. ఈ మూడు విభాగాలకు 2023–24 విద్యాసంవత్సరం నుంచి మూడేళ్లపాటు గుర్తింపు కొనసాగనుంది. పాలిటెక్నిక్ కాలేజీని మార్చి 24 నుంచి 26వ తేదీ వరకు ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌బీఏ నిపుణులు సందర్శించారు. కళాశాలలోని వాతావరణం, విద్యాబోధన, మౌలిక వసతులు, ప్రయోగశాలలు, బాలుర, బాలికల హాస్టల్స్‌ను పరిశీలించారు. టాస్క్ శిక్షణ, కళాశాల పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు.

మా కళాశాలలో చేరండి



వేములవాడలో ప్రచారం చేస్తున్న కళాశాల అధ్యాపకులు..రాచర్లగొల్లపల్లిలో

- ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల ఇంటింటి ప్రచారం
- ప్రవేశాలు తీసుకుంటున్న విద్యార్థులు

వేములవాడఅర్బన్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు చేపట్టిన ఇంటింటి ప్రచారం ఫలితాన్నిస్తుంది. వేములవాడ, ఎల్లారెడ్డిపేటల్లోని జూనియర్ కాలేజీ అధ్యాపకులు గత రెండు రోజులుగా ఇంటింటికి వెళ్లి తమ కాలేజీలో చేరాలని విద్యార్థులను కోరుతున్నారు. వేములవాడలోని అంజనీనగర్‌లో శనివారం స్థానిక జూనియర్ కాలేజీ లెక్చరర్లు శేఖర్, అశోక్, రవీందర్, గోపి ప్రచారం చేశారు.

25 మంది చేరిక

ఎల్లారెడ్డిపేట జూనియర్ కాలేజీ అధ్యాపకులు చేపట్టిన ఇంటింటి ప్రచారం సక్సెస్ అయ్యింది. తమ కాలేజీలో చేరితే నాణ్యమైన విద్యాబోధన చేస్తామని అధ్యాపకులు చేస్తున్న ఇంటింటా ప్రచారం ఫలితాలనిస్తోంది. మండలంలోని రాచర్లగొల్లపల్లి, గజసింగవరం గ్రామాలకు చెందిన 25 మంది విద్యార్థులు కళాశాలలో చేరుతున్నట్లు అంగీకార పత్రాలు రాసి ఇచ్చారు. ప్రచారంలో అధ్యాపకులు వాసరవేణి పర్శరాములు, చంద్రమౌళి పాల్గొన్నారు.

సైబర్ నేరాలను నియంత్రించాలి

- అవగాహనతోనే అడ్డుకట్ట
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ మోసాలకు పాల్పడుతున్న వారిని కట్టడి చేసేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న తీరు, దానిని అరికట్టడం, నేరాలు జరిగితే ఫిర్యాదు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ప్రతీ వారం జిల్లాలో ఏదో ఒక పోలీసుస్టేషన్‌లో సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అనుమానిత వ్యక్తులు, అనధికారిక వెబ్‌సైట్లు అందించే ఆఫర్లకు ఆకర్షితులై మోసపోవద్దన్నారు. ఇలా ఏవరైనా మోసపోతే డయల్ 100,సైబర్ నేరాలకు టోల్ ఫ్రీనంబర్ 1930 సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఈక్రమంలో వారంక్రితం ఇల్లంతకుంట సేషన్‌పరిధిలో ఒక వ్యక్తికి ఇన్సూరెన్స్ పేరిట మాయమాటలు చెప్పి అతని అకౌంట్ నుంచి రూ. 29వేలు, వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి టెలిగ్రామ్‌లో పార్ట్‌టైం జాబ్ పేరిట పెట్టుబడి పెట్టించి రూ.2.57 లక్షలు, ఎల్లారెడ్డిపేటలో క్రెడిట్ కార్డు హెల్ప్‌లైన్ నంబర్ కోసం వెతికిన వ్యక్తి అకౌంట్ నుంచి రూ.1.76 లక్షలు సైబర్ నేరగాళ్లు తస్కరించారన్నారు. ఇలాంటి నేరాలు పునరావృతం కాకుండా ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ సూచించారు.

బీసీ సంక్షేమశాఖ కార్యదర్శిని కలిసిన గోపా


వెంకటేశంగౌడ్‌ను కలిసిన గోపా కమిటీ సభ్యులు

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంగౌడ్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా గోపా నూతన కమిటీ సభ్యులు హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జూన్ 1న నిర్వహించే గౌడ విద్యార్థుల ప్రతిభా పురస్కారాలకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి సాయన్నగౌడ్, గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్, గోపా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్ గౌడ్, ప్రధానకార్యదర్శి విక్కుర్తి లక్ష్మినారాయణ గౌడ్, కోశాధికారి బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ భవన నిర్మాణానికి తరలిన నేతలు

- పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళ


వెళ్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళ తదితరులు

సిరిసిల్లటౌన్: హైదరాబాద్‌లో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పద్మశాలీ భవన నిర్మాణం పూజకు సిరిసిల్ల నుంచి నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, పాలిస్టర్ అసోసియేషన్, చేనేత వ్యాపారం సంఘం, వస్త్ర పరిశ్రమ అనుబంధాల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బీజేపీ


కోనరావుపేటలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కోనరావుపేట: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ అన్నారు. కోనరావుపేటలో శనివారం మాట్లాడుతూ.. 2025లోపు మనుధర్మశాస్త్రాన్ని ప్రవేశపెట్టాలని చూస్తోందన్నారు. నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం, వారిని అవమానించినట్లేనన్నారు. వందల హామీలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చకపోగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తోందన్నారు. ఇప్పటికైనా బహుజనులు మేల్కొని రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బొల్లె జాషువా, పాత్కాల సురేశ్, తైదల కరుణాకర్, బొడ్డు మధు, ఎరవెల్లి దిలీప్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనడంలేదని రైతుల ఆందోళన


ఎగ్లాస్‌పూర్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

కోనరావుపేట: మండలంలోని ఎగ్లాస్‌పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం ఎగ్లాస్‌పూర్ సెంటర్‌లో మాట్లాడుతూ.. సింగిల్‌విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క లారీలోడ్ ధాన్యం కూడా తరలించలేదన్నారు. చిన్నచిన్న వాహనాల్లో మేమే తరలించుకుంటున్నామని వాపోయారు. సింగిల్‌విండో అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆందోళనలో రైతులు పాల్గొన్నారు.

జీపీ రికార్డులు తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో రవీందర్

వీర్నపల్లి: మండలంలోని రంగంపేట జీపీ కార్యాలయాన్ని శనివారం జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ తనిఖీచేశారు. రికార్డులు పరిశీలించి లోపాలను గుర్తించారు. గ్రామసభ, పాలకవర్గ సమావేశాల్లో గ్రామ అవసరాలకు తీసుకున్న తీర్మానాల్లో మినిట్స్ బుక్‌లో ఖాళీలను గుర్తించి పంచాయతీ కార్యదర్శి పి.మహేశ్‌పై డీపీవో రవీందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని జీపీల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని కార్యదర్శులు సూచించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను, నర్సరీలను పరిశీలించారు. డీపీవోతో ఎంపీడీవో నరేశ్, సర్పంచ్ నందగిరి లింగం, ఏపీవో శ్రీహరి ఉన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు

- పట్టించుకోని అధికారులు


పొలంలో లూజ్ వైర్ల కోసం ఏర్పాటు చేసిన కర్ర

వేములవాడరూరల్: గ్రామాల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లు, వంగిన స్తంభాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సెస్ అధికారులు గ్రామాల్లోని విద్యుత్ సమస్యలపై పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన లూజ్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. దీంతో రైతులు కర్రలు ఏర్పాటుచేసి పంటపొలాలు సాగు చేసుకుంటున్నారు. ఇలా మండలంలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొందని విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

హామీలన్నీ నెరవేర్చింది కాంగ్రెస్సే


మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్

చందుర్తి(వేములవాడ): మాట తప్పకుండా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. చందుర్తిలోని హాథ్ సే హాథ్ జోడోలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. దేశాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ పార్టీపైనే ఉందన్నారు. ప్రియాంకగాంధీ హైదరాబాద్ సభలో యూత్ డిక్లరేషరన్ ప్రకటించారన్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూ రైతులను నిండా ముంచుతున్న టీఆర్‌ఎస్, బీజేపీలకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో గ్రామగ్రామాన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకాన్ని ప్రజల సమక్షంలో నిర్వహించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేశారన్నారు. జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ జెడ్పీటీసీ పొద్దుపొడుపు లింగారెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు అంచా రాంరెడ్డి, ముస్కు ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శులు గొట్టే ప్రభాకర్, ఇందూరి మధు, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జ మల్లేశం పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెలో అపశృతి

- అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయిన ఐకేపీ వీవోఏలు
- పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించిన వీవోఏలు


చందుర్తి పీహెచ్‌సీలో చికిత్సపొందుతున్న వీవోఏలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

చందుర్తి (వేములవాడ): తమ డిమాండ్లను పరిష్కరించాలని చందుర్తి మండలకేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్న ఇద్దరు ఐకేపీ వీవోఏలు వడదెబ్బతో శనివారం తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చందుర్తి మండలం లింగంపేటకు చెందిన వీవోఏ తర్రె పద్మ, అనంతపల్లికి చెందిన చిలుక కల్పనకు వడదెబ్బ తగలడంతో శిబిరం వద్ద సొమ్మసిల్లి పడిపోయారు. స్థానికులు వీరిని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించి వైద్యం చేయించారు. 22 రోజులుగా ఎండలో సమ్మెచేయడంతో అస్వస్థతకు గురైనట్లు వీవోఏలు ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు స్వరూప, రజిత, గంగ, మమత, వినోద తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం


కాలిపోయిన బోరు మోటార్

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామం పటేల్ చెరువు సమీపంలోని పొలాల్లో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి సుమారు 50ఎకరాల్లో మంటలు వ్యాపించాయి. దీంతో పొలాల్లోని పశుగ్రాసంతో పాటు బోరుమోటార్లు, పైపులు, కరెంట్ తీగలు కాలిపోయాయి. నష్టం రూ.లక్షల్లో ఉంటుందని ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని రైతులు కోరారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు


పోలీసులు సీజ్ చేసిన నగదు, సెల్‌ఫోన్లు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి శివారులోని ఎల్లమ్మ గుడి సమీపంలో పేకాట స్థావరంపై శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 12 సెల్‌ఫోన్లు, రూ.56,810 నగదును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై మారుతి మాట్లాడుతూ సులభంగ డబ్బు సంపాదించాలనే ఆలోచనతో పేకాట ఆడుతున్నారన్నారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే, పేకాట ఆడుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శ్రీనివాస్, అక్షర్, డిస్ట్రిక్‌గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని లింగన్నపేట–చిప్పలపల్లి గ్రామాల శివారులోని అటవీప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుడిచేతిపై బోదబాయ్ అనే పేరుతో పచ్చబొట్టు ఉంది. మృతుడు మహారాష్ట్ర, బీహార్ ఒరిస్సా, యూపీ రాష్ట్రాలకు చెందినవాడిగా పోలీసులు భావిస్తున్నారు. ఇండస్ట్రీ ప్రాంతాల్లో పనిచేసే వ్యక్తిగా అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైమహేశ్ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన దంపతులపై కేసు

- సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్

సిరిసిల్లక్రైం: పోలీసు అధికారిపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేయడంతోపాటు కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన భార్యభర్తలపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ శనివారం తెలిపారు. ఈమేరకు సీఐ మీడియాతో మాట్లాడుతూ ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన కాత మల్లేశం ఇటీవల జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చాడు. పోలీసులు కావాలని తనను జైలుకు పంపించారన్న కోపంతో సంబంధిత స్టేషన్ ఎస్సైపై సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు చేశాడు. అంతేకాకుండా ఇదే ఊరిలో మరో కేసు విషయంలో విచారణ కోసం కానిస్టేబుల్ మాలోతు చందు శనివారం వెళ్లాడు. గమనించిన కాత మల్లేశం, అతని భార్య సుమలత కానిస్టేబుల్‌ను దుర్భాషలాడారు. తమపై కేసు నమోదు చేసి మళ్లీ ఊరికి ఎలా వస్తారని ప్రశ్నించారు. ఊరిలోకి పోలీసులు రావడానికి వీలులేదని, తమను కాదని వస్తే అంతుచూస్తానని ఫొటోలు తీశారు. మల్లేశం అతని భార్య సుమలత తన విధులకు ఆటంకం కలిగించి, బెదిరించినట్లు కానిస్టేబుల్ మాలోతు చందు ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

అపూర్వ సమ్మేళనం



వేములవాడ: ఎక్కడోపుట్టి... ఎక్కడో పెరిగి చదువులమ్మ చెట్టునీడలో కలిశామన్నట్లుగా 20ఏళ్ల కింద చదువుకున్న వేములవాడ పట్టణంలోని జవహర్‌లాల్‌నెహ్రూ స్కూల్ పాఠశాల పూర్వవిద్యార్థులు శనివారం మళ్లీ కలుసుకున్నారు. 2003-04 పదోతరగతి చదివి వివిధ ప్రాంతాల్లో, వివిధ హోదాల్లో స్థిరపడిన వీరంతా స్థానికంగా ఉన్న మంజునాథ ఫంక్షన్‌హాల్‌లో తిరిగి కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను సన్మానించారు. చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకుని మురిసిపోయారు. డాక్టర్ సందెవేని తిరుపతి, గుమ్మడి వంశి, మనోజ్‌కుమార్, సౌమ్య, మహిపాల్‌రెడ్డి, విజయరెడ్డి, వేణు, కృష్ణ, అనిల్, రవికృష్ణ, వాణిలు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్: పట్టణంలోని టౌన్ 2 పరిధి 11 కేవీ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతులు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గాంధీచౌక్, మున్సిపల్, సెస్ కార్యాలయాల ప్రాంతాలు, విద్యానగర్, గీతానగర్, గాంధీనగర్, సుభాష్‌నగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

బోయినపల్లి: మండలకేంద్రంలోని బస్టాండ్ పరిసరాల్లో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. మండల సీపీఎం కన్వీనర్ గురజాల శ్రీధర్ మాట్లాడుతూ నిత్యం మండలకేంద్రానికి ఎంతోమంది ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారని, వారికి వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అశోక్, మహేందర్, ఎల్లయ్య తదితరులున్నారు.

చిన్నారులకు టీకాలు



చిన్నారికి టీకా వేసిన వైద్య సిబ్బంది

తంగళ్లపల్లి: మండలంలోని గోపాల్‌రావుపల్లె గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం చీర్లవంచ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చిన్నారులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ 3 ఏళ్లలోపు చిన్నారులకు ఉచితంగా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం మంజుల, ఆశావర్కర్ రేణుక, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని నేరెళ్ల తెలంగాణ గురుకుల విద్యాలయంలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఎంఎస్సీ బీఈడీ అర్హత కలిగిన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధ ఒక ప్రకటనలో తెలిపారు. సాంస్కృతం 1, ఇంగ్లిష్ 2, గణితం 3, రసాయనం 1, భౌతిక 1, వృక్ష 1, జంతుశాస్త్రం 1, సామాన్య 1, సాంఘిక శాస్త్రం 1, వ్యాయామ ఉపాధ్యాయురాలు 1 చొప్పున పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ముస్తాబాద్: ముస్తాబాద్ పీపుల్స్, యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ చింతోజు శంకర్ తెలిపారు. గుండెకు సంబంధించి ఉచితంగా ఈసీజీ, టుడీ ఇకో పరీక్షలు చేసి మందులు అందించనున్నట్లు తెలి పారు. కార్డియాలజిస్టు, న్యూరాలజిస్టు, ఆర్థోపెడిక్ వైద్యుల బృందం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నర్సరీల పరిశీలన

ఇల్లంతకుంట(సిరిసిల్ల):: మండలంలోని గొలపల్లి, జంగం రెడ్డిపల్లి గ్రామాల్లో నర్సరీలను శనివారం ఏపీవో చంద్రయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ఎండలతీవ్రత ఎక్కువ ఉన్నందున మొక్కలు ఎండిపోకుండా నీరందించాలని సూచించారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ కళావతి

వీర్నపల్లి: నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జెడ్పీటీసీ గుగులోత్ కళావతి అన్నారు. మండంలోని బావుసింగ్ నాయక్ తండా దుర్గమ్మ ఆలయం వద్ద శనివారం బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తండాలో తాగునీటి సమస్య ఉందని తమదృష్టికి తీసుకరావడంతో జెడ్పీటీసీ నిధులు రూ.లక్షతో బోరు వేసినట్లు లిపారు. ఈ సందర్భంగా తండా ప్రజలు మంత్రి కేటీఆర్, జెడ్పీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు. బంజారా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్ నా యక్, సర్పంచ్ భూక్య సుజాత, ఉపసర్పంచ్ రాజు, గుగులోత్ లింగం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చల్ల చల్లగా..

- వేసవి తాపానికి శీతల పానీయాల వైపు పరుగులు తీస్తున్న ప్రజలు
- అందుబాటులో పలు రకాల పండ్ల రసాలు
- జిల్లాలో పెరుగుతున్న విక్రయాలు

సిరిసిల్ల అర్బన్: రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. వేసవి తాపానికి ప్రజలు శీతల పానీయాల వైపు పరుగెడుతున్నారు. సీజన్‌తో సంబంధం లేకుండా ప్రజలకు అందుబాటులో పలురకాల పండ్ల రసాలతో కూడిన జ్యూస్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. పట్టణంలో చాలాచోట్ల పండ్లరసాలు, కొబ్బరిబోండాలు, చెరుకు రసాలు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మజ్జిగ, లస్సీ, ఫలుదా, బాదం మిల్క్ తదితర పానీయాలను సేవిస్తూ వేసవి దప్పిక తీర్చుకుంటున్నారు.

పండ్ల రసాలకు డిమాండ్

పట్టణంలోని పలు కూడళ్లు, బస్టాండ్ ఏరియా, గాంధీచౌక్‌తో పాటు పలు ప్రాంతాల్లో పండ్లరసాల దుకాణాలు, కొబ్బరి బోండాలు, సోడా దుకాణాలు వెలిశాయి. కూల్ డ్రింక్స్ అందుబాటులో ఉన్నా ప్రజలు వీటిని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. యాపిల్, నారింజ, తర్బుజా, మామిడి, దానిమ్మ, సపోట, తదితర పండ్ల రసాలు ఒక్కోగ్లాస్‌కు రూ. 40కి అమ్ముతున్నారు.



కొబ్బరిబోండాలు కొంటున్న ప్రజలు

కొబ్బరిబోండం...అమృత భాండం

సహజ సిద్ధంగా లభించే కొబ్బరిబోండాన్ని అమృత భాండంగా చెప్పుకోవచ్చు. కొబ్బరినీళ్లలో పోషక విలువలు మెండుగా ఉంటాయి. ఒంట్లో నీరసంగా ఉన్నా, జ్వరం వచ్చినా, అనారోగ్యానికి గురైనా కొబ్బరినీళ్లు తాగితే తక్షణ ఉపశమనం లభిస్తుంది. కాలంతో సంబంధం లేకుండా కొబ్బరిబోండాలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుంది. వేసవిలో మరింత డిమాండ్ పెరిగింది. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు, తక్షణ శక్తిని పెంచుకునేందుకు కొబ్బరినీళ్లు ఎంతగానో ఉపయోగపడుతాయి.



పాత బస్టాండ్‌లో జ్యూస్ స్టాల్

డీహైడ్రేట్‌కు దూరం..

వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడంతో పాటు శరీరం డీహైడ్రేట్ కాకుండా మజ్జిగ తోడ్పడుతుంది. ఎండ వేడిమిని తట్టుకొని శరీరానికి శక్తిని అందించడంలో సహాయపడుతుంది. వీటితో పాటు చెరుకు రసం, మోసంబీ, లస్సీ, ఫలుదా, నిమ్మరసం, తదితర పానీయాలను తాగుతున్నారు.

ఎండ తీవ్రత నుంచి రక్షణ



ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుంది. వేసవి తాపం నుంచి రక్షణ కోసం పండ్ల రసాలు, మజ్జిగ తాగుతున్నా. ఆరోగ్యానికి మేలు చేసే పండ్ల రసాలు ఎక్కువగా తీసుకుంటున్నా. పట్టణంలో చాలాచోట్ల పండ్లరసాల దుకాణాలు అందుబాటులో ఉన్నాయి.

– సుమన్, సిరిసిల్ల

ఆరోగ్యానికి మేలు



మార్కెట్‌లో దొరికే కొబ్బరి బోండాలు, చెరుకు రసాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వీటిని తాగడం వల్ల ఆరోగ్యానికి మేలు కలగడమే కాక, నీరసానికి గురి కాకుండా ఉంటుంది. నిత్యం పండ్ల రసాలు తాగుతా. ఎండ నుంచి జాగ్రత్తలు తీసుకుంటున్నా.

– భానుతేజ, సిరిసిల్ల

గిరాకీ పెరిగింది



సాధారణ రోజుల్లో కంటే వేసవిలో గిరాకీ పెరిగింది. ప్రస్తుతం పండ్ల రసాలు తాగేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అన్ని రకాల పండ్ల రసాలు వినియోగదారుల ముందే తయారు చేసి అందజేస్తున్నాం.

– కంచర్ల రవిగౌడ్, జ్యూస్ స్టాల్ నిర్వాహకుడు

చల్లంగ చూడు.. పోచమ్మ తల్లి



బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు డప్పు చప్పుళ్ల మధ్య బోనాలను నెత్తిన ఎత్తుకొని ఆలయానికి ఊరేగింపుగా బయలుదేరారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి చల్లంగా చూడు పోచమ్మ తల్లి అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. బైండ్ల కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ అనుపాటి భారతి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు రావులపెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు దొడ్డ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తరలించాలని బీజేపీ నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

కోనరావుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని తరలించాలని మండలకేంద్రంలోని క్రాసింగ్ వద్ద శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లారీలు రాక కొనగోలు కేంద్రాల్లో ధాన్యపు నిల్వలు పేరుకుపోతున్నాయని, ధాన్యం నిల్వలను తరలించి, కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మండలాధ్యక్షుడు గొట్టె రామచంద్రం, సురేశ్, బాలాజీ, దిలీప్, చల్ల జితేందర్, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణపై దృష్టి సారించాలి

ఎల్లారెడ్డిపేట: డే కేర్ నిర్వాహకులు వృద్ధుల సంరక్షణపై దృష్టి సారించి, వారి బాగోగులు చూసుకోవాలని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని డే కేర్ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. వారితో కలిసి భోజనం చేశారు. కేంద్రంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 16 మంది ఉన్నట్లు నిర్వాహకులు మచ్చ మమత తెలిపారు. వృద్ధుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ..కలెక్టర్‌తో మాట్లాడి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆయన వెంట సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు బండారి బాల్‌రెడ్డి, నర్సింలు, లక్ష్మారెడ్డి, తదితరులున్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న జెడ్పీటీసీ

క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): యువతలోని శక్తిని మేల్కొల్పడమే యూత్ డిక్లరేషన్ ఉద్దేశమని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. జూన్ 18న జరిగే రాజీవ్‌గాంధీ క్విజ్ పోటీలను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో జరిగే క్విజ్ పోటీల్లో ఒక మహిళకు ఎలక్ట్రానిక్ స్కూటీ అందించనున్నట్లు తెలిపారు. యూత్ డిక్లరేషన్‌లో పాల్గొనే యువతీ యువకులు 76618 99899 నెంబర్‌లో తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు లక్ష్మారెడ్డి, బాబు, రాజు, యువకులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇంటి నిర్మాణం

ముస్తాబాద్: మండలకేంద్రంలో ఇంటి నిర్మాణం నిబంధనల మేరకు చేపట్టినట్లు సర్పంచ్ గాండ్ల సుమతి స్పష్టంచేశారు. గ్రామ కంఠం, ఆబాది భూములను అనుసరించి పాత ఇంటిని కూల్చివేసి, దాని స్థలంలో 5 ఫీట్ల సెట్‌బ్యాక్‌తో పనులు చేపడితే కొందరు రాజకీయ కక్షతో పనులు చేపట్టామని ఆరోపిస్తున్నారన్నారు. మంత్రి కేటీఆర్ సహకారంతో చేసిన అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకే అసత్యపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. పంచాయతీ అధికారుల అనుమతులు, ఎంపీవో ఆదేశాల మేరకు తాము నిర్మాణం చేపట్టామన్నారు. దీనిపై ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాజకీయ లబ్ధికోసమే తనపై ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ పేర్కొన్నారు.

రుణమాఫీ చేయాలి

ఇల్లంతకుంట: గత 2018 ఎన్నికల్లో రూ.లక్ష రుణమాఫీ చేస్తామన్న సీఎం కేసీఆర్ ఇప్పుడు 90 వేల వరకే రుణమాఫీ చేస్తామని గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్చిన హామీమేరకు సీఎం కేసీఆర్ లక్ష వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరిలోనే రుణమాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, ఇంతవరకు మాఫీ చేయలేదన్నారు.

'సీఎంఆర్‌ఎఫ్' చెక్కు అందజేత

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కొండాపూర్ చెందిన మల్యాల కీర్తనకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.12 వేల చెక్కును బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవ య్య అందజేశారు. ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి ఎంతగానో దోహదపడుతుందన్నారు.

సన్మానం

వేములవాడ రూరల్ : తెలంగాణ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన దండి సంతోష్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. వేములవాడ బైపాస్ ఫుడ్‌హబ్‌లో బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ.. సామాన్యుల సమస్యలను వెలికి తీయడంతోపాటు జర్నలిస్టుల సంక్షేమానికి బాధ్యతతో పనిచేయాలన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కట్కం శ్రీనివాస్, కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, మహేశ్, సగ్గు శేఖర్, బోనాల శివ, బుస్సా శ్రీధర్, ఫుడ్‌హబ్ నిర్వహకులు ఆకుల శ్రీని వాస్, అలివేలి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సంతోష్‌ను సన్మానిస్తున్న నాయకులు

దూరభారం తగ్గించేందుకే అంతర్గత రోడ్లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామస్తులకు దూరభారం తగ్గించేందుకే అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఒగ్గు రజిత అన్నారు. మండలకేంద్రంలోని అంతర్గత రోడ్ల నిర్మాణానికి శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉపాధిహామీ కింద గ్రామంలోని అన్ని రహదారులను కలుపుతూ అంతర్గత మట్టి రోడ్ల నిర్మాణం చేపడుతామన్నారు. ఇందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఇక్కడ కార్యదర్శి దేవరాజు, వార్డు సభ్యులు, నాయకులు బాల్‌రాజ్ యాదవ్, జవ్వాజి లింగం, తదితరులున్నారు. .



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కాంగ్రెస్ నాయకుల నివాళి

సిరిసిల్లటౌన్: పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని శనివారం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నెహ్రూ ఉద్యానవనంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భారతదేశ తొలి ప్రధానిగా నెహ్రూ చేసిన సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఇక్కడ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, నాయకులు సూర దేవరాజు, తాటికొండ శ్రీనివాస్, సతీశ్, భాను, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

లారీల కొరత తీర్చండి..

వీర్నపల్లి : మండలంలోని గర్జనపల్లి కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యం ఇప్పటివరకు ఐకేపీ నిర్వాహకులు, అధికారులు తరలించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లారీలు సకాలంలో రాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ధాన్యాన్ని త్వరగా తరలించి ఇబ్బందులు తొలగించేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



తూకం వేసిన ధాన్యం

అందరూ డ్యాన్సర్లే..

- నృత్య ప్రదర్శనలో రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు
- భరతనాట్యం, కూచిపూడిలో శిక్షణ
- తండ్రి ప్రోత్సాహంతో మరింత ముందుకు



టీవీ నటులతో వర్షిణి, స్నేహ, వెన్నెల



ఫోక్ డ్యాన్సర్‌తో అక్కా చెల్లెళ్లు

సిరిసిల్ల కల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన పండుగ రవి – మాధవి దంపతులు పాత బస్టాండ్ పరిసరాల్లో టీ స్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కూతుళ్లు స్నేహ, వర్షిణి, వెన్నెల ఉన్నారు. స్నేహ పదో తరగతి పూర్తిచేయగా వర్షిణి తొమ్మిదో తరగతి పూర్తయింది. వెన్నెల ఏడో తరగతి చదువుతోంది. వీరంతా గీతానగర్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో చదువుతుండగా చిన్నప్పటి నుంచే నాట్యంపై మక్కువ పెంచుకున్నారు. ఆ దిశగా రాణించేందుకు నిత్యం సాధన చేస్తున్నారు. డ్యాన్స్ మాస్టర్ల వద్ద నేర్చుకున్న మెళకువలు నృత్య సాధనకు బాగా ఉపకరించాయి. అక్కాచెల్లెళ్లు ఒకరికొకరు పోటీ పడుతూ డ్యాన్స్ షోలతో అలరిస్తున్నారు. కూతుళ్లను వాళ్ల అభిరుచికి అనుగుణంగా శిక్షణ ఇప్పిస్తూ తండ్రి రవి ప్రోత్సహిస్తున్నారు. సినిమా ప్రధాన గీతాలపై చేసే నృత్యాలకు తోడు శాస్త్రీయ నృత్యంపై శిక్షణ ఇప్పిస్తే మరింత రాణించే అవకాశం ఉందని భావించి భరతనాట్యం, కూచిపూడి తదితర రంగాల్లో శిక్షణ ఇప్పించారు. వివిధ కార్యక్రమాల్లో వీరి నృత్య ప్రదర్శన ఆహూతులను ఎంతగానో అలరిస్తోంది. ప్రదర్శించిన ప్రతి చోటా ప్రశంసలతో ముందుకుసాగుతున్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యక్రమాల నిర్వహణలో అక్కాచెల్లెళ్ల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. యూట్యూబ్‌లో వచ్చే జానపద గీతాలపై నర్తిస్తూ డిజిటల్ మాధ్యమాలపై ఆధారపడిన ప్రేక్షకులకు చేరువ అవుతున్నారు.

ఆనందంగా ఉంది

చిన్నప్పుడు నేను డ్యాన్స్ షోలకు ప్రభావితం అయ్యాను. నాట్యంపై అంతగా సమయం కేటాయించలేదు. కూతుళ్ల ఆసక్తి చూపించడంతో ప్రోత్సహించా. యూ ట్యూబ్ ఆల్బమ్‌లు కూడా చేస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది.

– పండుగ రవి, తండ్రి

మజ్జిగ పంపిణీ

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలో ఉపాధిహామీ కూలీలకు సర్పంచ్ కొక్కుల భారత మజ్జిగ పంపిణీ చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు. సాసాల మల్లారెడ్డి, కొక్కుల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.